క్లుప్తంగా

స్థలం కేటాయించాలని వినతి



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతులకు సంక్షేమ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)కి వినతిపత్రం సమర్పించారు. విస్సన్నపేట మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీని కలిసిన బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, సభ్యులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, పరసా నెహ్రూ, మాయిరి వెంకటరమణ తదితరులు బీసీ సంక్షేమ భవన నిర్మాణ ఆవశ్యకతను వివరించారు.

హనిమిరెడ్డిని కలిసిన ఏసీపీ, సీఐలు



మైలవరం: ప్రవాసాంధ్రులు, విద్యా దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని మైలవరం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్. మోహనరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. కిశోర్‌బాబు మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మైలవరం అభివృద్ధికి డాక్టర్ హనిమిరెడ్డి సేస్తున్న సేవలను ప్రశంసించారు. మైలవరంలో విద్యా వ్యాప్తికి లకిరెడ్డి సోదరులు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మైలవరం, వెల్వడం గ్రామాల సర్పంచ్‌లు గరికిపాటి మంజుభార్గవి, ప్రత్తిపాటి ధర్మరాజు, ఎంపీటీసీ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు శీలం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ల అందజేత



విస్సన్నపేట: విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని) నిధులతో మంచి నీటి సరఫరా నిమిత్తం మండలంలో ఐదు గ్రామాలకు రూ.12,50,000 విలువ చేసే ఐదు ట్యాంకర్లను ఎంపీ మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అందజేస్తున్న ట్యాంకర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ ఎస్. సుధారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఎంపీడీఓ జి. విజయకుమారి పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

నూజివీడు: ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని నూజివీడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. నాగమురళి అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రత మనందరి బాధ్యత అంశంపై నూజివీడులో ఆటో డ్రైవర్లు, మోటార్‌క్యాబ్ – మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రైవర్లందరూ లైసెన్స్ కలిగి ఉండాలని, సరుకు రవాణా చేసే వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించరాదని అన్నారు. వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువశాతం చిన్న వయస్సు వారు మరణిస్తున్నారని, దీనివల్ల దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే యువత జీవితాలు అర్ధంతరంగా ముగిస్తుండటం దేశానికి నష్టమన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన వారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించి రోడ్డు ప్రమాద బాధితులను కాపాడిన వారికి రూ.5 వేల నగదు బహుమతిని ఇవ్వడంతో పాటు ఆపద్బాంధవుడిగా గుర్తించి సేవా పత్రం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఓసీలో వన మహోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఎల్‌పీజీ ప్లాంట్‌లో సామూహిక వన మహోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. చీఫ్ మేనేజర్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈడీ అనిల్ కుమార్, జనరల్ మేనేజర్ యోగరాణి సురేష్ మాట్లాడుతూ కాలుష్యం నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. అనంతరం వివిధ రకాల మొక్కలు నాటారు. డీజీఎం వి.కుమార్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

చాట్రాయి: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, కారంగుల వాసు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు పెద్దదిక్కుగా సీఎం వైఎస్ జగన్

- ఎంపీ కేశినేని నాని
- ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, నూతన భవనాలు ప్రారంభం
- ఆసరా నమూనా చెక్కు పంపిణీ



సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించిన ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు, నాయకులు



డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని



పార్టీలో చేరిన వారితో ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు తదితరులు

విస్సన్నపేట: రాష్ట్రంలో పేదలకు పెద్ద దిక్కుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, మీరందరూ బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని) అన్నారు. మండలంలోని కొండపర్వ గ్రామంలో రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.5 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను ఎంపీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక మార్కెట్‌యార్డు గోదాము వద్ద ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మించి నవరత్నాల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలను పేదలకు నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదవారికి ఇంటివద్దకే వైద్యసేవలు అందించడం గొప్ప విషయమన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో మండలంలో రూ 40 కోట్లు రుణ మాఫీ అక్కా చెల్లెమ్మల ఖాతాలో జమ చేశారని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రూ.5 కోట్లతో విస్సన్నపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించామని తెలిపారు. అన్ని వసతులతో మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేశామన్నారు. పేదల విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కొన్ని పత్రికలు, చానళ్లు అభివృద్ధి లేదని ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. మీరందరు బాగుంటే మీ సంతోషం, మీ సుఖం, మీ ఆనందం, మీ పిల్లలు బాగా చదువుకోవటం కంటే అభివృద్ధి ఏమి ఉంటుందని ఎంపీ అన్నారు. మానవ అభివృద్ధి కంటే ఏ అభివృద్ధి ఎక్కువ కాదని చెప్పారు. మీరు అభివృద్ధి చెంది మీ జీవితాలు బాగుంటే, మీ జీవన శైలి మెరుగు పడితే, మీ పిల్లలు బాగా చదువుకుంటే ఏ ప్రాంతమైనా, ఏ రాష్ట్రమైనా బాగుంటుంది. ఈ రోజు ముఖ్యమంత్రి చేస్తున్న కార్యక్రమాలే ఇందుకు నిదర్శనం కాబట్టి జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని ఎంపీ కోరారు.

చంద్రబాబు, లోకేశ్‌కు ఇవే ఆఖరి ఎన్నికలు..

2024 ఎన్నికల్లో కచ్చితంగా ఓడిపోతామని చంద్రబాబుకి తెలుసు. అందుకే ఆయన ఇక్కడ ఇల్లు కట్టుకోలేదు. ఈ ఎన్నికలు చంద్రబాబుకి, ఆయన కుమారుడు లోకేశ్‌కి చివరి ఎన్నికలని ఎంపీ కేశినేని నాని అన్నారు. ఆ నాడు ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల వారి కోసం టీడీపీని స్థాపిస్తే చంద్రబాబు టీడీపీని పేదలకు దూరం చేసి పెత్తందారుల కోసం, వారి స్వార్థం కోసం పని చేస్తున్నారన్నారని ఎంపీ విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల కోసం రాష్ట్రంలో 175కి 175 స్థానాలు వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరం పని చేయాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసరావు, అనుమోలు శివబాజీ, నెక్కళపు కుటుంబరావు, భూక్యా రాణి, ఎంపీడీఓ జి. విజయకుమారి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక..

విస్సన్నపేట: విస్సన్నపేట మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, మరో 20 కుటుంబాలు టీడీపీ నుంచి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక మార్కెట్ యార్డు గోదాము వద్ద మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం అనంతరం లక్ష్మయ్య వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని ఎంపీ పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు పాల్గొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రిన్సిపాల్ ఎంవీ బసవేశ్వరరావు

నూజివీడు: యువత అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు అన్నారు. పట్టణంలోని శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథి బసవేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశంలో ఉన్నంత యువశక్తి ప్రపంచంలో మరే దేశంలోనూ లేదన్నారు. ప్రభుత్వాలు యువశక్తిని సరైన మార్గంలో ఉపయోగించుకునేలా దిశానిర్దేశం చేయాలన్నారు. తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు యువత ఎల్లప్పుడూ ముందుండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

తిరువూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగంగా గ్రామ స్థాయిలో ఆదాయ వనరులు పెంచుకోవడం, మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి ప్రజలను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలు రూపొందించుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ
- పరీక్షలు నిర్వహించి మందులు అందజేత



జూపూడి శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు



పోలవరంలో జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అనూష

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయని సర్పంచ్ కంచర్ల వాణి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల నోడల్ అధికారి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అధ్యక్షతన మంగళవారం గోపవరం హైస్కూల్ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు షకీనా ఇవాంజిలిన్, భవానీ, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్, అశ్విత 612 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 54 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 36 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వైద్య శాఖ, సచివాలయాలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జూపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం రెండో విడత మండలంలోని జూపూడిలో జరిగింది. శిబిరాన్ని సర్పంచి కాకి దేవమాత మంగళవారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్ పర్యవేక్షణలో వివిధ విభాగాల వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ముఖ్యంగా మధుమేహం, బీపీ, రక్తపరీక్షలు, కళ్లు, డెంటల్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యులు సూచించిన రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు పంపించారు. మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సీహెచ్ఓ నారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, వార్డు సభ్యుడు కృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం..

చాట్రాయి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు చెలికాని అనూషా అన్నారు. పోలవరంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్‌ని రోగులకు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ, సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి, ఎంపీడీఓ మంగా కుమారి, వైద్యులు సుప్రియా చౌదరి, శ్వేత, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, సీహెచ్ఓ రమణ పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన నాయకులు



మంత్రి జోగి రమేష్, తిరుపతిరావును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావును వివిధ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, సెర్ప్ రిసోర్స్ పర్సన్‌లు ఇబ్రహీంపట్నంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జ్ తిరుపతిరావుకు అభినందనలు తెలిపారు. మైవలరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధించేలా సమన్వయంతో పని చేయాలని నాయకులకు మంత్రి సూచించారు. కొండపల్లి వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని 27వ వార్డు కౌన్సిలర్ మామిళ్లపల్లి చైతన్య స్రవంతి, ఐవోసీ ఆనంద్ కోరారు. వివిధ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చీమలపాడులో పారిశుద్ధ్య పనులు

ఎ.కొండూరు: చీమలపాడు గ్రామంలో సర్పంచ్ మోర్ల లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో రహదారికి ఇరువైపులా మురుగునీరు నిల్వ లేకుండా పారే విధంగా పూడిక తీత పనులు చేయించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించి సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే ఇండ్లలో ఉన్న చెత్తను సేకరించి ట్రాక్టర్లపై ఊరు బయటకు తరలిస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టి రహదారికి ఇరువైపులా బ్లీచింగ్ చల్లించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

హనుమంతులగూడెంలో వైద్య శిబిరం

నూజివీడు: హనుమంతులగూడెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి. సునందాకుమారి ఆధ్వర్యంలో గ్రామంలోని సచివాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఎంపీడీఓ కె. కిరణ్‌కుమార్ సందర్శించారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పర్యటించి ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీతారాంపురంలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.40 లక్షలతో ఆర్‌అండ్‌బీ సిమెంట్ రోడ్డు, నాడు–నేడు నిధుల ద్వారా మండల ప్రజా పరిషత్ పాఠశాలలో రూ.15.50 లక్షల నిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. జల్ జీవన్ నిధులు రూ.72.80 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయిలు పథకానికి శంకుస్థాపన చేశారు. ఈదర గ్రామంలో రూ.72.80 లక్షలు, బొద్దనపల్లిలో రూ.31.80 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశారు. ఎస్ఏ పేటలో రూ.6 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పిన్నమరెడ్డిపల్లి, రాజవరానికి మంజూరైన రూ.1.30 కోట్లతో ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశారు. నూగుండపల్లిలో రూ.6 లక్షలతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పోతవరప్పాడులో రూ.56.70 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశారు. నెక్కలం గొల్లగూడెంలో రూ.31.50 లక్షల నిధులతో నిర్మించిన సీసీ డ్రెయినేజీలను, రూ. 6 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అడవి నెక్కలంలో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.25 లక్షలతో నిర్మించిన నిర్మించిన డ్రెయినేజీలను ప్రారంభించారు. సింగన్నగూడెంలో రూ.6 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ గోళ్ళ అనూష, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీడీఓ శామ్యూల్, పల్లగాని నరసింహారావు, మచ్చా హరిబాబు, అత్తి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం



అప్పిడి సత్యనారాయణరెడ్డితో మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

మైలవరం: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరావు మంగళవారం కలిసి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని కోరారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని, ఆ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తన సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. నాగులూరి దుర్గాప్రసాద్, టి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఏసీపీ

తిరువూరు: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తిరువూరు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఏసీపీ మురళీమోహన్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సందర్భంగా కల్పించాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై స్థానిక పోలీసులకు సూచనలిచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మార్కింగ్ చేయాలని ఆదేశించారు. పీటీకొత్తూరు, చిట్టేల, ఆంజనేయపురం, లక్ష్మీపురం, మల్లేల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తిరువూరు సీఐ నబీ, ఎస్ఐ సత్యనారాయణతో కలిసి ఏసీపీ సందర్శించారు.

ప్రమాదాల నివారణకు పోలీస్ గస్తీ

మైలవరం: మైలవరంలో మైనర్‌లు వాహనాలు నడుపుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ బాలికల హైస్కూల్ కూడలి వద్ద ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మైనర్ బాలురు, బాలికల హైస్కూల్ వద్ద వాహనాలు అతి వేగంగా నడుపుతుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయం మైలవరం సీఐ కిశోర్‌బాబు దృష్టికి రావడంతో స్పందించి ఉదయం స్కూల్ ప్రారంభించే సమయం, స్కూల్ విడిచిపెట్టే సమయాలలో పాఠశాల వద్ద పోలీస్ గస్తీ ఏర్పాటు చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ సమావేశం ఎంపీపీ కార్యాలయంలో బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు.

గజవాహనంపై శోభనాచలుడి గ్రామోత్సవం



ఆగిరిపల్లి: మాఘమాస రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం రజక సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మండపంలో శాంతి కల్యాణం నిర్వహించారు. మంగళవారం రాత్రి 7 గంటలకు వైశ్య సంఘం ఆధ్వర్యంలో గజవానంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సందడి

నూజివీడు: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సోమవారం రాత్రి పాటలు పాడుతూ, డ్యాన్సులు చేస్తూ కళాశాల ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. ట్రిపుల్ ఐటీలోని స్టూడెంట్ మిత్ర ఆధ్వర్యంలో సితారా 2 కే 24 పేరుతో మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగార్జునదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సంగీత కళను అందరికీ పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.స్టూడెంట్ మిత్ర అధ్యక్షుడు సీహెచ్ పవన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా రేడియో దినోత్సవం

ముసునూరు: ఆకాశవాణిగా ప్రసిద్ధి చెందిన రేడియో మాధ్యమం ద్వారానే ప్రజల్లో చైతన్యం ప్రారంభమైందని మండల కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు అన్నారు. చెక్కపల్లిలో మంగళవారం ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రేడియోలో ప్రసారమయ్యే కార్యక్రమాలను నేటి తరం వారు కూడా విని, రేడియో శ్రోతలుగా మారాలని ఆకాంక్షించారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశం

తిరువూరు: తిరువూరు మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశం స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం నిర్వహించారు. గ్రామ స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధం తదితర విధుల నిర్వహణపై ఎస్ఐ సత్యనారాయణ సూచనలిచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి మహిళా సంరక్షణ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.